# వెరీ సింపుల్

విడాకుల కేసులో కోర్టుకెళ్ళి, బోనెక్కి తనభర్తనుండి ఎందుకు విడాకులు కావాలో చెప్పగలగడం భార్య అనే ఆడపిల్లకి జీవితంలో కలిగే అత్యంత దౌర్భాగ్య స్థితులలో ఒకటి అందులో వారి వివాహం ప్రేమ వివాహమయి వుంటే ఇంకా దౌర్భాగ్యస్థితి. నాలుగేళ్ళు కాపరం చేశాక అయితే ఆ ఆడపిల్ల అయిన భార్య సిగ్గుతో నిలువునా చచ్చిపోవాలి.

అలాంటి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనేసమర్థత తనకుంటుందని అర్పిత కోర్టు గదిలోకి వెళ్ళబోయేముందు అనుకోలేదు, కోర్టు గదిలోని డిఫెండెంట్ కి కలిగే తడబాటు ఏ మాత్రం అర్పితకు కలగలేదు మేఘావృతమయిన ఆకాశంలో మెరిసే మెరుపులా అర్పిత రుద్ధకంఠంతో వేగంగా చెప్పసాగింది.

"ఆయన అందగాడికిందే లెక్క. నాలుగంకెల జీతం వస్తోంది, ఆయనతో ప్రేమలో పడ్డాను, చివరకు వివాహం కూడా అయింది ఆయనకి కూడా నేనంటే ఎంతో ఇష్టం. ఆయన చాలా విషయాలలో నామీద ఆధారపడటం ముఖ్యంగా నామీద ఆయనకున్న ప్రేమని అధికం చేసింది. స్నానం చేసేటప్పుడు వంగి పాదాలు రుద్దుకోవడం కూడా ఆయనకు తెలియదు. ఆ అలవాటు కూడా నా వల్ల అయింది. ఆయనకి నేనంటే ప్రేమ! ప్రతి నెలా జీతంతోపాటు స్వీట్ పాకెట్ తెస్తారు జీతం మొత్తం నా చేతులలో పోస్తారు. ఏం మిగిలింది, ఎంత ఖర్చయింది ఆయనకి అక్కరలేదు. కూరలో ఉప్పు ఎక్కువయినా తెలియదు, అసలు మర్చిపోయినా అలాగే తింటారు. లాండ్రీకి బట్టలు వేసే నేగుర్తుచేసేదాకా తేరు! మతిమరపంటే మళ్ళీ అదీకాదు నా పుట్టినరోజు మా పెళ్ళిరోజు గుర్తుంచుకుని నాకు చీర తేవడం మర్చిపోలేదు యింతదాకా. ఏ కొత్త సినిమా రిలీజ్ అయినా మొదటి ఆటకి టికెట్స్ బుక్ చేస్తారు, నాకు కుదరదంటే తలూపి వెళ్ళి వాటిని కేన్సిల్ చేస్తారు, కాని తనొక్కరూ సినిమాకి వెళ్ళరు. రోజూ రాత్రిళ్ళు ఆయనే వంట చేస్తారు. ఆయన వంట రుచి చూస్తే రోజూ కావాలనిపించేంత అద్భుతంగా వుంటుంది. జడవేయ

మంటే ఆఫీసర్ మా యింటికి టీకి వచ్చినా ఆయన ముందు వేయడానికి జంకరు. బికాస్ హి రియల్లీ లవ్స్ మి అండ్ హి నీడ్స్ మి. ఇంటిలో రేడియో పాడయితే చిటికలో బాగుచేస్తారు. చెట్టెక్కి కొబ్బరిబొండాలు కోస్తారు కుడిచేతితో సైకిల్ హేండిల్ పట్టుకొని ఎడంచేతితో ఇరవై లీటర్ల కిరసనాయలు డబ్బాని అవలీలగా తీసుకురాగలరు. ఆఫీస్‌నుంచి వచ్చాక గంటసేపయినా షటిల్ కాక్ ఆడతాం. నాకు చదరంగం నేర్పించింది ఆయనే. హి యీజ్ ఏ క్లెవర్ మేన్. ఆయన ఆడే పద్ధతి చూస్తే తెలుస్తుంది, ఐ లవ్ హిమ్ సోమచ్ ...."

అర్పిత ఆయాసంగా కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ చెప్పసాగింది కళ్ళనించి నీళ్లు కారుతూంటే.

"ఇన్ని మంచి లక్షణాలున్నా అమృతంలో విషం చుక్కలా ఆయనలోని అతి చెడ్డగుణాన్ని ఇక భరించడం నాచేతకాదు. నెలకో ఇల్లు సిగ్గుతో చచ్చిపోతూ, మార్చడం నాచేత కాదు" చేతిరుమాలుతో కళ్ళని బుగ్గలని తుడుచుకుంది.

"ఏమిటది?" జాగ్రత్తగా వింటున్న జడ్జి ఆసక్తిగా ఆమెను అడిగారు.

"ఆయనకి నాకు విడాకులు ఇవ్వకపోతే న్యాయమే లేదు యీ కోర్టులో. రోజూ ఉదయం ఆఫీస్‌కు వెళుతూ వీధిలోంచి ఆయన, ఆ రాత్రి నాతో ఎన్నిసార్లు సంభోగించదలచుకున్నారో చుట్టుపక్కల వాళ్ళు వినేలా, గట్టిగా అరిచి చెప్పి మరీ వెళుతున్నారు గత సంవత్సరన్నరగా. ఆ తర్వాత ఇరుగు పొరుగుకి మొహం చూపించాలంటే సిగ్గుతో చావనాకు, వద్దంటే వినరు. నేను కోరుకునే విడాకులు నాకు ఇస్తున్నారా లేదా?" అడిగింది అర్పిత ఏడుపు తన్నుకువస్తూంటే.

ఆమెకు విడాకులు లభించాయి.

దాదాపు సంవత్సరం తర్వాత విడాకులివ్వబడ్డ అర్పిత భర్త మాజీ ప్రియురాలయిన తన రెండో భార్యని ముద్దు పెట్టుకొని చెప్పాడు ఆనందంగా.

"చూశావా! నీ స్నేహితురాలు అర్పితనించి విడాకులు రావడం వెరీ సింపుల్ అంటే నమ్మలేదు నువ్వు"

# మూడో అలక

అరగంట ఆలస్యంగా వచ్చినందుకు ఆఫీసర్ చేత పావుగంటసేపు చివాట్లు తిన్నది అలక.

ఆమె పేరు అలక. కానీ పేరుకి విరుద్ధంగా అలక ఎంతో శాంత స్వభావురాలు జీవితంలో రెండుసార్లే అలక అలిగింది. అదీ చిన్నప్పుడు. పెళ్ళయ్యాక అలక భర్త అమర్ సరదాగా నయినా అలకకి కోపంతెప్పించ లేకపోయాడు.

ఆమె కోపం తెచ్చుకోదని అలక ఆఫీసర్ కూడా ఆమెని తిట్టడంలో వెనుకాడడు. తిట్లన్నీ తిన్నాక అలక శాంతంగా. "బస్ బ్రేక్‌డౌన్ అయింది. వేరేబస్ దొరకటం లేటయ్యింది" ఎక్స్‌ప్లనేషన్ బుద్ధిగా శాంతంగా చెప్పింది. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేసి తన సీట్లోకి వెళ్ళి కూర్చుని ఏం జరగనట్లు పని చేసుకోసాగింది.

లంచ్ నించి రాగానే ఆఫీసర్ ఆమెని పిలిచి చెప్పాడు.

"ఐయామ్ సారీ అలక! మీ పక్కింటావిడ ఇందాక ఫోన్ చేసింది మీ ఇంట్లో గేస్‌స్టవ్ ఆర్పడం మర్చిపోయావట వంటగదిలోంచి మంటలు వస్తున్నాయని, త్వరగా రమ్మని చెప్పింది త్వరగా వెళ్ళమ్మా."

"అరెరె!" అని మాత్రం అంది అలక.

అలక కొలీగ్ ఒకాయనకి స్కూటర్ వుంది. ఆఫీసర్ అతన్ని పిలిచి సంగతి చెప్పి, అలకని వాళ్ళింటికి స్కూటర్‌మీద తీసుకెళ్ళమని చెప్పాడు.

స్కూటర్ మీద ఇద్దరూ పదినిమిషాలలో అలక ఇంటికి చేరుకున్నారు. బయట తాళం కప్పలేదు. ఆమె భృకుటి ముడిపడింది. భర్త తనతోనే ఆఫీసుకి వెళ్ళాడు మరి తాళం కప్ప ఎవరు తెరిచినట్లు?